



మూలం
పి.జి.వుడ్‌హౌస్ నవల
ది ఓల్డ్ రిలయబుల్

అనుసృజన
గబ్బిట కృష్ణమోహన్

ఎమెస్కో

# ఆపద్బాంధవి-ఉరఫ్-పాపాలభైరవి

జనవరి నెల చివరి రోజులు, హైదరాబాదులో వాతావరణం చల్లగా ఆహ్లాదకరంగా వుందారోజు. ఒకప్పుడు మలయాళం సినిమాల్లో టాప్ హీరోయిన్‌గా పేరుపొందిన కుంజురాణీదేవి గారి "కుంజురాణీ నివాసం" ముందటి ఆవరణ నీరెండలో చలి కాచుకుంటోంది. కుంజురాణీదేవి చనిపోయి సంవత్సరం దాటింది. ఇప్పుడా యింటికి యజమానురాలు శ్రీమతి రత్నమాలా మునుస్వామినాయుడు గారయినా, యింకా కుంజురాణీ నివాసంగానే వ్యవహరిస్తుంటారందరూ.

ఆ యిల్లు బంజారా హిల్సులో ఎత్తుగా గుట్టమీదుంది. గేటు ముందున్న రోడ్డు మరి కొంచెం పైదాకా వెళ్లి ఆగిపోతుంది. తరవాత వున్నవన్నీ చెట్లు, పుట్టలు, గుట్టలూ. విశాలమైన ఆ యింటికి ముందువైపు స్విమ్మింగ్ పూలు, గులాబీ తోట, సపోటా చెట్లూ, కొన్ని మామిడి చెట్లు వగైరా వున్నాయి. ఇవన్నీ నీరెండలో వెలుగుతున్నా యింటిముందు ఆవరణలో వాలుకుర్చీలో కూచుని - మితంగా తినడమనేది తెలీక వొళ్లు పెంచేసుకున్న రోమను ప్రభువులా అనిపించే వయసుడిగిన పెద్దమనిషి - మనసుని మాత్రం ఆ నీరెండ వుత్తేజపరచడంలేదు. అతని పేరు రంగయ్యనాయుడు - శ్రీమతి రత్నమాలాదేవి భర్తకి స్వయానా తమ్ముడు. బోనులో పెట్టుంచినవాడిలా ఏదో పోగొట్టుకున్నట్టు ముభావంగా కూచుని అప్పుడే కళ్లముందొచ్చిన ఆకారాన్ని గమనించాడు.

పొడుగ్గా సన్నగా వున్న ఆ ఆకారం ఆయింట్లో పనిచేసే బట్లరు శేషయ్యది. పొడుగాటి గ్లాసునిండా నింపున్న బార్లీ వాటరుని ట్రేలో పెట్టుకుని హుందాగా నడిచొస్తున్నాడతను. రత్నమాలాదేవి యింట్లో వుండే ప్రతి వస్తువు ఆవిడగారి ఐశ్వర్యాన్ని, ఘనతని చాటి చెప్పుతుంది. అందులో మరింత ముఖ్యంగా చాటి చెప్పేది - బట్లరు శేషయ్య వునికి. తెల్లదొరల దగ్గిర పనిచేసి అపారమైన అనుభవం గడించాడు. వాళ్ల దగ్గిర తర్ఫీదు పొందిన వాడైతే నిక్షేపంలా వుండిపోతాడు. అంతకు మించినవాడు దొరకటం అసాధ్యం.

ఇష్టమైన మేనల్లుడి మీద ఔదార్యం చూపించే మేనమామలా, "తవఁరికి బార్లీ వాటరు తెచ్చాను, పుచ్చుకోండయ్యా" అన్నాడు శేషయ్య.

ఎండకి వొళ్లు కాచుకుంటున్న రంగయ్యనాయుడు పగటికలలు కంటూ, తను అత్యంతంగా యిష్టపడే విస్కీకి బదులు ఆ టైములో రోజూ తప్పకుండా గ్లాసెడు బార్లీ వాటరు పుచ్చుకోవాలనే ఆంక్షని వదినెగారు విధించిన సంగతి మర్చిపోయాడు. చేతిలోకి గ్లాసు తీసుకుని అయిష్టంతో వాసన చూశాడు. పనిచేస్తూ మెకానిక్‌లు చేతులు తుడుచుకోడానికి వాడే గుడ్డముక్కలాంటి వాసనేస్తోందని భావించి, ఆ ముక్కే పైకి అన్నాడు.

తవఁరన్నదాంతో ఎంతో కొంత పోలిక వున్నట్టు తనకి కూడా అనిపిస్తోందని జాలిగా మర్యాద చూపిస్తూ జవాబిచ్చాడు శేషయ్య.

"అవుతే ఆరోగ్యానికి చాలా మంచిదంటారయ్యా. పంజాబులో రైతులు కుండలకొద్దీ తాగుతారంటయ్యా. అందుకే ఆళ్ల బుగ్గలెప్పుడూ విచ్చుకున్న మందారాల్లా ఎఱ్ఱగా నిగనిగలాడతాయంటారయ్యా."

"సర్లే, ఎఱ్ఱబుగ్గల రైతులెవడికి కావాలిటా?"

"అవునయ్యా, అదీ నిజవేఁలెండయ్యా."

"ఎఱ్ఱబుగ్గల రైతెవడన్నా కనిపిస్తే నువ్వే అట్టిపెట్టుకో."

"చిత్తం, అలాగేనండయ్యా."

గట్టి ప్రయత్నంతో అయిష్టంగానే గ్లాసులోది గుటికెడు తాగి చూశాడు. గుక్క తిప్పుకునేందుకు ఒకనిమిషంపాటు ఆగి, కింద కనిపిస్తున్న వూరు వంక చిరాగ్గా చూశాడు.

"ఎందుకొచ్చిన జీవితంలే నాది, శేషయ్యా!" అన్నాడు రంగయ్యనాయుడు.

"చిత్తం."

"కుక్కలక్కూడా వద్దు బాబూ ఇలాంటి నికృష్టపు జీవితం."

"ప్రపంచవంతా దుఃఖంతో నిండుందయ్యా," నిట్టూరుస్తూ అన్నాడు శేషయ్య.

అతను చూపిస్తున్న సానుభూతి రంగయ్యనాయుడికి రుచించలేదు.

"దుఃఖం సంగతి నీకేం తెలుస్తుందయ్యా," అన్నాడు చిరుకోపంతో. "చీకూ చింతా లేని బట్లరుద్యోగమాయె నీది. ఇక్కడ బాలేదనిపిస్తే యింకో చోటికి పోవచ్చు నువ్వు. నేనాపని చెయ్యగలనా చూడు? నువ్వెప్పుడైనా జెయిల్లో వుండొచ్చావా శేషయ్యా?"

ఆ ప్రశ్నకి శేషయ్యనివ్వెరపడ్డాడు, కంగారు కూడా మొదలైంది.

"నాకు తెలుసు, గడపలేదని. అంచేత నా పరిస్థితి నీకర్థం కాదు."

రంగయ్యనాయుడు బార్లీ వాటరు పూర్తిగా తాగేసి మౌనంగా ఆలోచిస్తూ వుండిపోయాడు. అన్నగారైన మునుస్వామినాయుడుగారి వీలునామా గుర్తుకు తెచ్చుకుని దాంట్లో ఆ మనిషి తేటతెల్లంగా రాసిన దాన్ని ఒక్కొక్కరు ఒక్కొక్కవిధంగా భాష్యం చెప్పగలరన్న విషయం తలుచుకుంటే బాధవేసింది. మునుస్వామినాయుడు ఆస్తినంతా భార్య రత్నమాలాదేవి పేరిట వీలునామాలో రాస్తూ, తన తదనంతరం తమ్ముడు రంగయ్యనాయుడి జీవనానికి ఆవిడగారు ఆధారం కలగచెయ్యాలని షరతు పెట్టి వదిలాడు. గందరగోళానికీ, దురవగాహనకీ దారి తీసేందుకు యిదో గొప్ప వుదాహరణ అని చెప్పొచ్చు. అసలొక ఆడది యింకో మగాడికి జీవనాధారం కలగచెయ్యాలనే షరతు వెనకాలున్న వుద్దేశ్యం, రంగయ్యనాయుడి అవగాహన ప్రకారమైతే – మంచి ఏరియాలో తనకో యిల్లు కట్టించి యిచ్చి, యిల్లు గడవటానికీ, కారు నడపటానికీ, యింకా రెండు మూడు క్లబ్బుల్లో మెంబరవటానికీ, అలాగే సంవత్సరానికోసారి సిమ్లాలోనో, వూటీలోనో గడిపొచ్చేందుకూ వగైరా వగైరాలకి సరిపడేంత వనరులు ఆవిడగారు సమకూర్చాలి – అని. అయితే, పొదుపుగా జీవితం వెళ్లబుచ్చే రత్నమాలాదేవి అవగాహన ఏమిటంటే – భర్త విధించిన షరతు ప్రకారం కేవలం మరిదిగారికి పడుకోడానికి పక్కా, మంచం మువ్పూటలా తిండి, వుండటానికి యింట్లో యింత చోటు – అని. అదిగో, రంగయ్యనాయుడి దినచర్య సరిగ్గా ఆ పంథాలోనే నడుస్తోందిప్పుడు. సుష్ఠుగా తినడం, కావలసినన్ని మజ్జిగ తాగటం, హాయిగా నిద్రపోవటం తప్పించి ఆ దురదృష్టవంతుడికి ఏళ్ల తరబడి మరో వ్యాపకం లేక జెయిల్లో ఖైదీలా మగ్గుతున్నాడు.

ఆలోచనల్లోంచి బయటకొచ్చి చిన్నగా నిట్టూర్చాడు. జాలిపడుతూ నుంచున్న బట్లరు శేషయ్యని ఆంతర్యంలోకి తీసుకుని తన మనసులో వున్నది దాచకుండా వెళ్లబోసుకోవాలని అనిపించింది.

“శేషయ్యా, అసలు నేనేమిటో తెలుసా?”

“అయ్యా?”

“బంగారు పంజరంలో బంధించిన పక్షినయ్యా.”

“నిజవాఁయ్యా?”

“నేనో క్రిమికీటకం లాంటివాణ్ణి.”

“నన్ను కంగారెట్టేస్తున్నారయ్యా తవఁరు. పంజరంలో బంధించిన పక్షిలాంటోరని గదా నేనర్థం చేసుకున్నది?”

“పురుగుని కూడానయ్యా. కాలికింద నలిగే పిపీలికాన్ని. కనుచూపు మేరలో వెలుగనేది చూడలేని పురుగుని. తాలుకా ఆఫీసుల్లో వుంటారే, వాళ్లనేమంటారు?”

“తాశిల్దార్లా అయ్యా?”

"బంట్రోతులు. నేనొట్టి బంట్రోతుని. రా ఇక్కడికి, ఫో అక్కడికి అంటూంటే ఆ ఆజ్ఞల్ని శిరసావహించేవాడిని. ఇనప పాదంతో నొక్కుతూ కుక్కలా చూస్తారే – అలాంటివాణ్ణి. మనసుని మరీ బాధించే విషయమేమిటంటే ఒకప్పుడు నాదగ్గిర బోలెడు డబ్బుండేది. లెక్కలేనంత డబ్బు. ఇప్పుడైతే అంతా వూడ్చిపెట్టుకుపోయింది."

"అవునాయ్యా?"

"అవును, అంతా పోయింది. హారతి కర్పూరంలా హరించుకుపోయింది. వున్న ఆస్తిని చేతులారా పోగొట్టుకున్నా. శేషయ్యా, విచ్చలవిడిగా డబ్బు ఖర్చుపెట్టేవాళ్లందరికీ గొప్ప గుణపాఠమయ్యా యిది."

"చిత్తవంయ్యా."

"ఆస్తి పోగొట్టుకోవడం ఎంత తెలివితక్కువ పనయ్యా. క్షమించరాని నేరం. చేతిలో చిల్లిగవ్వ లేకపోతే ఏవిటి నీదారి?"

"మరేనండయ్యా."

"మరేనండయ్యా అన్నదే కరెక్ట్. నాకో వెయ్యి రూపాయలు అప్పుగా సర్దాలయ్యా?"

"సర్దలేనయ్యా."

అతను అప్పిస్తాడని రంగయ్యనాయుడికి ఏకోశానా అనిపించలేదు. అయితే, ఒక్కటంటే ఒక్కరోజు – రాత్రంతా హాయిగా ఆ మహానగరంలో వుండే విలాసవంతమైన ప్రదేశాల్లో గడపాలనే కోరిక బలీయంగా ప్రబలడంవల్ల అలా ప్రస్తావించాల్సి వచ్చిందతనితో. ఈ బట్లర్లున్నారే వీళ్లు డబ్బు బాగా కూడబెడతారని తెలుసతనకి. పదిలంగా దాచుకున్న ధనాన్ని అందరూ కలిసి పంచుకుని సద్వినియోగం చెయ్యాలనే దాంట్లో గట్టి నమ్మకమున్నవాడు రంగయ్యనాయుడు.

"పోనీ, ఓ అయిదొందలు?"

"లేవయ్యా."

రంగయ్యనాయుడు అత్యాశ పడే వ్యక్తి కాదు, సమయాసమయాల్ని బట్టి సర్దుకు పోయే విచక్షణాజ్ఞానం వుంది. "అయిదొందల్తో సరిపెట్టుకుంటాన్లేవయ్యా,"అన్నాడు.

"నాదగ్గిర్లేవయ్యా."

రంగయ్యనాయుడు యింక వదిలేశాడు. డబ్బు వృథా చెయ్యకూడదని యింతకుముందే తను అనడం చాలా తప్పని ఆలశ్యంగా గుర్తించాడు. ఎదుట నుంచున్నవాడికి స్వతహాగా తట్టకపోయినా వాడి బుర్రలోకి తనే ఎక్కించినట్టు అయింది. ముఖం చిట్లిస్తూ చిరాగ్గా కూచునుంటే ప్రాణం ఒక్కసారి లేచొచ్చినట్టయింది. ఈ దరిద్రపు కొంపలోకి నిన్ననే కావుడు వచ్చి చేరిందనేది ఠక్కున గుర్తొచ్చింది. ఆమె రాకతో పరిస్థితులు మారుతాయి. అప్పు చెయ్యడానికి అంత మంచి